


# సీతారాముల ప్రణయం



కన్నుసామి

*ప్రథమ వీక్షణంలోనే హృదయం దోచుకొన్నది ఆమె. హృదయమూ అర్పించినది. సుక్షత్రియుల కడుపున పుట్టినదేమో తన ఆరాధ్యదైవం కూడా ఔచిత్యానికి భంగం కలిగించడాన్ని సహించలేకపోయినది. చేయని పాపానికి తగని శిక్ష అనుభవించడం తప్పలేదు.*

---

**అంత**దూరంలో సింహాచలం కనిపిస్తోంది. ప్రకృతి పురుషుడు కట్టివేసిన 'నల్లని ఐరావతం'లా ఆ మహాపర్వతం సమున్నతంగానూ, సుదీర్ఘంగానూ ఎంతదూరం వ్యాపించి ఉన్నదో రెండు కొండల మధ్యనుంచి ఇంకాన వ్రష్టపడలేదు. సుపరిచితమైన ఆ దైవాచలాన్ని సులభంగా పోల్చాడా యువకుడు. అతడి శరీరం ఆత్మీయతతో పులకరించింది. ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. విద్రాహారాలూ, విశ్రాంతీ అమరక తూలుతున్న అతడి శరీరానికి జవసత్వాలు వచ్చినట్టయింది. అతని నల్లని కళ్లలో, వర్షిస్తున్న మేఘంలో మెరుపు వచ్చినట్టు, నీరు చిమ్మడం, వెలుగు

# సీతారాముల ప్రణయం

రావడం ఒకేసారి జరిగాయి. ధూళి కొట్టుకు పోయిన శరీరంలో రోమాంచం కలిగింది. ఉత్తేజితుడైన ఆ యువకుడు రాళ్ళూ రప్పలూ లెక్కచెయ్యకుండా కొద్ది సేపటిలోనే సింహాద్రి నాథుని పర్వతానికి చుట్టుతిరిగి విశాఖపట్నం పరిహద్దుల్లో అడుగుపెట్టాడు. సాయంత్రం దీపాలు పెట్టారు. అతడి స్ఫురద్రూపాన్నీ, తీక్ష్ణమైన కళ్లనూ దారిలో కొందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు. అత నొక మేడముందు ఆగి పైకి చూచి గుమ్మంలో అడుగుపెట్టాడు. నౌకర్ని పిలిచి, 'మీ చినబాబు ఇంట్లో ఉన్నారా' అన్నాడు. ఈ యువకుడి తీరుచూచి 'ఎలా సమాధానం చెప్పాలా' అని నౌకరు అనుకుంటూ ఉండగానే రాజుకు ఎదురుగా మేడదిగి వస్తున్న వ్యక్తి కనుపించాడు. అతను 'ఎవరయ్యా నువ్వు' అన్నాడు. 'నన్ను ఇంకా పోల్చలేదూ' అన్నాడు యువకుడు. మిత్రుడికి సుపరిచితమైన గొంతు వినగానే మూడేళ్లక్రిందటి ఈ మనిషి గుర్తుకు వచ్చి సంభ్రమాశ్చర్యాలతో 'రామరాజా' అని కౌగలించుకొన్నాడు. 'ఎన్నాళ్లకు చూశాను రాజా! ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్లావు? ఇంత మారి పోయా వేమిటి?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

రామరాజు ఎన్నో దశలు గడిచాక చూచినట్టుంది మిత్రుడికి. విద్యార్థి దశలో ఇద్దరూ విడిచిఉండేవారే కాదు. విద్యార్థులందరికీ రామరాజుకూ ఎంతో తేడా ఉండేది. ఎవరికీ అర్థంకాని చరిత్ర గ్రంథాలు చదివేవాడు. పాఠాలు వినేవాడు కాదు. అయిదవఫారం చదువుతూండగా, తుని దగ్గరగా ఉన్న కొండల్లోకి పోయి రోజులకొద్దీ గడపటం అతనికి అలవాటయింది. ఆ కొండల్లో గూడేలూ, ప్రజలూ, వారి జీవన పద్ధతులూ అన్నీ రామరాజుకు క్షుణ్ణంగా తెలుసు. రామరాజుతో ఎక్కువ సన్నిహితంగా తిరిగి అతడిపై అమిత ప్రేమ చూపించిన దీమిత్రుడే! రామరాజు హిందూ రనపుత్రవీరుల కోవకు చెందినట్టు భావించేవాడు. అతని ముఖంలో రాచతీవి, గాంభీర్యం మిత్రుణ్ణి ఆకర్షించేవి.

స్నానం చేశాక ఇద్దరూ మేడమీద కూర్చున్నారు. రామరాజు పర్యటన విశేషాలన్నీ మిత్రుడు తెలుసుకున్నాడు. రామరాజుకు దేశ సంచారమన్నా, పర్వతప్రాంతాల్లో కాలం గడపడమన్నా ఎందుకంత ఇష్టమో మిత్రుడు ఎప్పుడూ అర్థం చేసుకోలేకపోయాడు. ఆ మాటే రామరాజును ఈ రోజు అడిగాడు. రామరాజు చిరునవ్వు నవ్వి అన్నాడు—'ఇదివరకెప్పుడూ ఈ ప్రశ్నలేదేం' అని.

"ఇదివరకైతే చిన్నప్రశ్నకింద కొట్టివేసి ఉందును. ఇప్పుడు పెద్దవాళ్లమయాం. ఇది వరకులా నీ జీవిత పరమార్థం నీకే తెలియకుండా ఉండలేవు. నీ జీవితాన్ని నడిపించే తత్వమేదో నీకు అర్థమై ఉంటుందన్న నమ్మకంతో అడుగుతున్నాను."

రాజు ఒక్క నిట్టూర్పు విడిచాడు. "కొందరి జీవితాలకు ఒకంతట లక్ష్యం ఏర్పడదు. ఇంత వరకూ నా జీవిత లక్ష్యమేదో తెలుసుకోలేక పోయాను. అనేక ప్రాంతాలూ, ప్రజలూ, వారి జీవన విధానాలూ, పరిస్థితులూ చూశాను. ఎక్కడచూచినా బరువు మోస్తున్నట్లు మనుషులు బతుకుతున్నారు. ధైర్యం, వికాసం ఎక్కడా మచ్చుకు కనుపించలేదు. వారందరి జీవితాల నీడ నాపైని ప్రసరిస్తోంది. నాలో ఏదో ఆవేదన, అన్వేషణ ప్రారంభమయ్యాయి. ఈ ఆవేదన తీరే దెప్పుడో తెలియదు" అన్నాడు మిత్రుడికి జవాబుగా.


పక్కన కూర్చున్న మిత్రుని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. స్కూల్లో రాజుకూ, నేటి రాజుకూ ముఖ్యమైన తేడా కనుపించింది. ఆనాటి రాజు అశ్రద్ధ మనిషిలా వెనక బెంచిలో కూర్చొనేవాడు. ఈనాటి రాజు రాజర్షిలా విశాలమైన తన కళ్లతో భవిష్యత్తులో తనుసేవించగల మానవ ప్రపంచాన్ని అన్వేషిస్తున్నాడు. అతడికి సమీప భవిష్యత్తులోనే ఏదో లక్ష్యం సిద్ధిస్తుందేమో అనిపించింది మిత్రుడికి. "అందుకు నువ్వు చేయగలిగిన దేమిటి రాజా" అన్నాడు మిత్రుడు.

"ఇంత బరువుగా జీవిస్తున్న వారిలో చైతన్యం, ఆనందోత్సాహాలు ఎలా వెల్లివిరుస్తాయి? మానవుల జీవితానికిఉండవలసినపరిపూర్ణత వీరిలో ఎందుకు లోపించింది? ఈ లోపం ఏ విధంగా తీర్చగలం? అనేదే నా ఆలోచన" అన్నాడు రాజు. మిత్రుడు కూడా రామరాజుతోబాటు ఆలోచనలో పడ్డాడు.

"అన్నయ్యా! భోజనానికి లెమ్మంటున్నారు."

రాజు అటు తిరిగాడు. మిత్రుడు అది గమనించి "ఆమె నా చెల్లెలు సీత" అన్నాడు.

"అలాగా?" అన్నాడు రాజు. ఆమెకు పద్దెనిమిదేళ్లకు ఇటూ అటూ వయస్సుండవచ్చు. ముఖంలో, అవయవ సౌష్ఠవంలో ఆమె యవ్వనం రూపురేఖలు దిద్దుకొన్నది. ముఖం ఎంత అమాయకంగా ఉన్నా కళ్లు 'అది అబద్ధమని' రుజువు చేస్తున్నాయి. ఆమె ముఖంమీద అల్లరిచేస్తున్న



ముంగురులు ఆమె మనోగత భావాలకు ప్రతిబింబాలేమో అనిపించాయి. రాజుకు ఆమెను చూడగానే 'బహుశా శ్రీరాముని స్వయంవరంలో చేపట్టిన సీత ఇలాగే ఉండి ఉంటుం' దనిపించింది.

"రాజా భోజనానికి లేస్తావా?" అన్నాడు మిత్రుడు. రామరాజుకు తన ఆకలి జ్ఞాపకం వచ్చింది. సీత ముందుగా వెళ్లి ఏర్పాట్లు పూర్తి చేసింది. మిత్రునితోబాటు రాజు కూడా భోజనానికి కూర్చున్నాడు. భోజనం అవుతూండగా జ్ఞాపకం వచ్చి, "మీ నాన్నగారెక్కడ?" అని మిత్రుణ్ణి అడిగాడు రాజు.

"ఇవాళ వేగం ఇంటికి రారట."

"ఏమి? ఏదైనా వ్యాపారం చేస్తున్నారా?" రాజు ప్రశ్నించాడు.

"కాదు. మహారాష్ట్రనుంచి ఒక దేశభక్తుడు వచ్చాడట. అతణ్ణి కలిసి వస్తారు." రామరాజుకు ఆ గృహస్థుమీద మంచి గౌరవం కుదిరింది దీర్ఘాలోచనలో పడ్డాడు. "నెయ్యి ఉంచమంటారా" అన్నమాట విని ముఖం ఎత్తి చూశాడు. ఎదురుగా సీత. ఒక్కసారి ఈ ప్రపంచంలోకి దిగివచ్చిన రాజు 'ఊ' అన్నాడు. మిత్రుడు రాజును "పరధ్యానంలో పడకుండా భోంచెయ్యి రాజా" అని హెచ్చరించాడు.

• • •

రాత్రి పన్నెండు వరకూ మిత్రుడితో ఇష్టాగోష్ఠివల్ల రాజుకు ఉదయం ఒకంతట మెలకువ రాలేదు. కొన్ని రోజులు మాసాలై పరియైన నిద్రాహారాల్లేని రాజుకు, రాత్రి ప్రేమాదరాలతో భోజనం, మెత్తని శయ్య, సుఖదుఃఖా లెరుగని మనుష్యావస్థను కలిగించాయి. ఉదయం రాజు లేచేసరికి మిత్రుడు స్నానాదికాలు పూర్తి చేసుకొని రాజుకోసం ఏర్పాట్లు చేశాడు. రామరాజు స్నానం అయాక ఇద్దరూ మధ్య హాల్లో కూర్చున్నారు. రాజు తన మిత్రుడితో మాట్లాడుతూండగా —అజానుబాహువూ, తెల పంచె, పైనిలాల్చీ, నెడల్పాటి ముఖంమీద శ్రీచూర్ణపు బొట్టుతో ఒకవ్యక్తి లోపలినుంచి గబగబా వచ్చాడు. "వారే మా నాన్నగారు" అన్నాడు మిత్రుడు. ఆయన సురద్రూపిగానూ హుందాగానూ కనుపించాడు. రాజు నమస్కారం చేశాడు. ఆయన "నిన్ను వచ్చిన దగ్గర్నుంచి కలియలేకపోయాను రాజా. కూచో" అన్నాడు. "నీ సమాచారం అంతా అబ్బాయి చెప్పాడు. నువ్వు మా అబ్బాయితోబాటే ఇక్కడే ఉండు. కొన్నాళ్లపాటు ఉండవలసిందిగా నా కోరిక కూడా" అన్నారాయన. రాజుకు ఆయన చూపుతున్న వాత్సల్యానికి చాలా ఆనందం కలిగింది. కొద్దిసేపు రాజు కుటుంబ విషయాలు అడిగి తెలుసుకున్నా రాయన. లోకాభిరామాయణంలోకి దింపి రాజుకు గల ప్రపంచజ్ఞానాన్ని, తెలివితేటలను గ్రహించాడు. తనకు దేశీయుల తత్వంమీద, దేశ సమస్యలమీద, ప్రముఖుల మీద గల వివిధ అభిప్రాయాలను వివరించారు. రాజు ప్రతి విషయాన్నీ జాగ్రత్తగా విని తన అభిప్రాయాలతో సరిచూసుకున్నాడు. కాని జవాబు చెప్పలేదు. ఆయన నౌకరుచేత కండువా, చేతికర్ర తెప్పించుకొని కండువా భుజాన వేసుకుంటూ, "నేను రావడం ఆలస్యం కావచ్చునబ్బాయ్. నువ్వూ రాజూ భోంచెయ్యండి" అని వీధిలోకి బయలుదేరాడు.

• • •

"రాజా నువ్వేదైనా ఉద్యోగం చెయ్యరాదూ? నాన్నగారితో చెప్పమంటావా?"

"అంతపని చెయ్యకు. అప్పుడు మనస్సుకూ ఆచరణకూ ఏకీకరణ కుదరదు. నే ననేకమంది బాధలు చూశాను. ఎవరి బాధలూ తీర్చలేని వాణ్ణి అయితే, నేనూ బాధలే కోరుకుంటాను. వాటికి దూరంగా తొలగి సుఖించాలన్న కోరిక లేదు" అన్నాడు రాజు, తనలో అస్పష్టమైన అభిప్రాయాలను వివరిస్తూ.

"నీకు సిద్ధార్థుడులా ఏదైనా మార్గం అభిస్తే నాకంటే సంతోషించేవారుండరు."

భోజనం చేస్తూండగా రాజు మిత్రునికి ఎక్కడినుంచో కబురు వచ్చింది. అతను వీధిలోకి వెళ్తూ మొగమాటపడకుండా తన గదిలోనే విశ్రమించవలసిందిగా చెప్పి మరీ వెళ్లాడు రాజుకు. రాజు ఇంకా గదిముందుకు చేరకముందే, వెనక ఇంట్లో ద్వారం దగ్గరనుంచి పనికత్తెను పిలిచి, "ఇది ఆయనకు ఇచ్చిరా" అంటూ తాంబూలమిచ్చి పంపుతూంది సీత. పనికత్తె తనకు అందిస్తూండగా, "నాకు తాంబూలం అలవాటు లేదు" అన్నాడు రాజు. పనికత్తె వెనక్కు తగ్గింది. "పరవాలేదు. తీసుకోండి" అన్నది సీత. రాజు తాంబూలం అందుకుంటూ, "మీ అమ్మగారికి తమ మర్యాద చూచుకోవడమేగాని నా బ్రహ్మచర్యం మీద సానుభూతిలేదు" అన్నాడు. సీతకు వెంటనే బదులు చెప్పడానికి ఏమీ తోచలేదు. కాని రాజు మాటలకు ఆమెకు వచ్చిన నవ్వే సమాధానమయింది. ఆమె మేఘకన్యలా మెరిసి వెళ్లిపోయింది. ఆమె కళ్లల్లోనుంచి ప్రసరించిన కాంతి ఇంకా అతని హృదయంలో వెలుగు నింపుతూంది. 'ఇంత సౌందర్యవతిని తనెక్కడా చూడలేదు. నేటివరకూ తను ఏ స్త్రీనీ ముగ్ధుడై చూడలేదు. ఈమెలో ఎందుకింత ఆకర్షణ! ఆమె కళ్లలో ఏవో సందేశాలున్నాయి. మనస్సులో ఏవో భావాలుంచుకొని తనవైపు అలా చూస్తున్నదేమో! అవి తను గ్రహించలేకపోతున్నాడేమో! ఆమె కళ్లు చాలా తెలివైనవి. అయినా నోరులేని ఆ కళ్లు తమ తెలివితేటలను ఎలా చూపించగలవు! ఆమె నోరు పట్టి అమాయకురాల్లా చిన్నదై ముడుచుకొని తనలో మల్లె మొగ్గల వంటి పలువరుసనుకూడా దాచుకొని కూర్చుంది.'

రాజు గదిలో కూర్చున్నాడు. ఏమీ తోచలేదు. అటూ ఇటూ పచారుచేస్తూ అక్కడి పక్కమీద పుస్తకాలు తిరగవేసి చూశాడు. ఒక్కటీ తనకు నచ్చలేదు. పడుకుందామని పక్కమీద వాలాడు. నిద్ర రాలేదు. అసలు పడుకోవాలని


సినిమానటులు

మీరు సినీకారులుగాచేరి, నెలకు, మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

**BOMBAY FILM SERVICE, (W.A.P.) PHAGWARA (N.R.)**

నాకాన్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడునవసరంలేదు. ఈవ్యాధి నిర్మూలనకుగాను 30 సం.ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదఔషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకము

ఇండియన్ మెడిసన్ హౌస్,

విజయవాడ—2.

హోం సినిమా ప్రొజెక్టరుకు

ఆర్డరు యివ్వండి.




ఇంటిలో అద్భుతమైన వినోదం

సాహసాలు, ప్రేమ, వగైరా దృశ్యాలు మీ ఇంట్లోనే మా ప్రొజెక్టరుతో చూడండి. టార్చితో గాని ఏసి/డిసి ఎలెక్ట్రిసిటీతోగాని పని చేయును. 35 ఎం. ఎం. ఫిలిం. ధర రు. 15. 40 ఫిలిం 4'×3' స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం పోస్టేజి రు. 4—50 న.పై. డీలక్సు స్పెషల్ రు. 25. 60' ఫిలిం స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం. పోస్టేజి రు. 5. తృప్తిలేనిచో సొమ్ము వాపసు. స్టాకు మితంగాఉన్నది. నేడే ఆర్డరివ్వండి.

**Hollywood Cinema Corpn. (Regd.), (APW), 2194, Kalyanpura, Delhi-6.**

# సీతారాముల ప్రణయం

లేదు. లేచి మళ్లా ఇటూ అటూ తిరగడం ఆరంభించాడు. కిటికీ దగ్గర నిలబడి అటు చూస్తున్నాడు.

"మీ కీ పుస్తకం ఇష్టపడుతుందేమో చూడండి"—వెనకనుంచి గొంతు వినిపించగానే రాజా వెనక్కు తిరిగాడు. సీత చేతిలో పుస్తకం బల్లమీద ఉంచి నిల్చుంది.

"ఓ! ఏమిటా పుస్తకం" అంటూ చేతిలోకి తీసుకొని చూశాడు. అతడి కళ్లు ఆశ్చర్యంగా చూశాయి. 'వేటపరప్రభుత్వం—విప్లవోద్యమం' అని చదివాడు రాజా. చదివాక ఆమెను చూచేసరికి ఆమె కళ్లు రెప్పవాల్చకుండా అతని ముఖ భంగిమలనే గమనిస్తున్నాయి. ఆమె తల, కనురెప్పలు వాలలేదు. పుస్తకం మరొక్కసారి తిరగవేసి చూశాడు. రచయిత ఎవరో తెలియదు. 'ఒక విప్లవ వాది ' అని ఉంది. ఏ బెంగాలీ పుస్తకానికో తెలుగు అనువాదమై ఉంటుందనిపించింది. "చదవదగిన పుస్తకం యిచ్చారు" అన్నాడు రాజా. ఆమె ముఖంలో ప్రశ్నార్థకం తొలగిపోయింది. "నాకు పుస్తకం కావాలనీ, ఏమీ తోచడంలేదనీ, ఎలా గ్రహించారు?" అన్నాడు రాజా. సీతకు ఏం చెప్పాలో తెలియలేదు. అతనేం చేస్తాంటాడో, దేనికోసం వెదుక్కుంటూ ఉంటాడో ఆమె మనస్సుకు తెలుసు. ఎలా తెలుసంటే దానికి జవాబు 'బుద్ధి'కి తెలియదు. సీత కనురెప్పలు వాల్చి తల ఒక పక్కకు తిప్పి సిగ్గుపడిన ఎర్రని బుగ్గలకు పోటీగా కదలిన పెదవులలోనుంచి "ఏమో! నాకెలా తెలుస్తుంది" అన్నది. రాజా చూస్తూండగానే ఆమె వెళ్లిపోయింది. రాజా మనస్సంతా సీత నిండిపోయింది.

'సీత ఈ పుస్తకాలు చదివి ఉండాలి. తనకు ఇష్టపడిన పుస్తకాలే ఇచ్చింది. ఈ పుస్తకం చదవనిదే ఆమె అభిప్రాయం ఎలా తెలుసుకోవడం?'

రాజా మనస్సు నంతటినీ కేంద్రీకరించిపుస్తకం చదవడం ఆరంభించాడు. చదువుతున్న కొద్దీ రాజా ఉత్సాహానికి మేరలేదు. ప్రజాజీవితంలో రాజకీయ కారణంగా ఎంత దుస్థితి కలిగినదీ అందులో రచయిత కళ్లకు కట్టినట్లు చిత్రించాడు. 'ఈ దుస్థితిని నిర్మూలించడానికి మన కర్తవ్యం ఏమిటి?' రచయిత తన అగ్నికణాలవంటి మాటలతో పాఠకుడి ప్రతి రక్త బిందువునూ సలసల మరిగించి విప్లవాగ్ని రగుల్కొల్పుతున్నాడు. 'ఈ కిరాతక ప్రభుత్వం పోవాలి. భారతీయులందరూ తమ ధర్మాన్నీ తమ జీవన వికాసాలనూ పునః ప్రతిష్ఠించుకుందుకు ఈ పరాయి ప్రభుత్వం మీద విప్లవోద్యమాన్ని లేవదీయాలి! కొన్ని వేల మైళ్ల దూరంలో ఆరుకోట్ల జనాభా గల దేశం నుండి వచ్చిన వారి ప్రతినిధులను నలభైకోట్ల మంది భారతీయులు ఆత్మ విశ్వాసంతో, ధైర్యంతో ఎదిరిస్తే మనముందు ఈ ప్రభుత్వ మెంత! దీని శక్తి ఎంత! !' రామరాజా హృదయం ఉప్పొంగింది. ప్రతి రక్తబిందువూ 'విప్లవం, విప్లవం' అంటూ శరీరమంతా ఉరకలు పెట్టి రోమాంచన పతాకాల నెగరవేసింది. రామరాజా ఆలోచిస్తూ కూర్చున్నాడు. ముఖం గంభీరముద్ర వహించింది.

సీత వచ్చింది.రాజా చూడలేదు. "నాన్నగారు" అంటూ ఆగింది సీత. రాజా ఇటు తిరిగి హఠాత్తుగా లేచి 'ఏం నాన్నగా రొస్తున్నారా.. ఏరీ" అన్నాడు. సీత చిరునవ్వు నణచుకొని "రాలేదు. ఇందాకా వచ్చి వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు పురమందిరంలో సభ జరుగుతుందిట. ఒక మహారాష్ట్ర దేశభక్తుడు మాట్లాడతాడట. నాన్నగారిందాకా మీరు చదువుకుంటున్నారని చెప్ప లేదు. మిమ్మల్ని కూడా తప్పక రమ్మని చెప్ప మన్నారు" అన్నది. "నాన్నగారుంటారుగా" అన్నాడు రాజా.

"లేదు. ఉదయంనుంచీ ఈ పనిమీదనే తిరుగుతున్నారు. అప్పుడే వచ్చి వెళ్లారు."

"పోనీ మీ అన్నయ్య వస్తాడుగా" అన్నాడు రాజా.

సీత "ఇంతవరకూ అన్నయ్య రాలేదు.అన్నయ్య కోసం చూడవద్దన్నారు నాన్నగారు" అన్నది.

రాజా "మరి నేనెలా వెళ్తాను" అన్నాడు.

"నేను వస్తాను" అన్నది సీత తల వంచుకొనే.

"చాలా సంతోషం. మీ సహాయానికి కృతజ్ఞుణ్ణి" అన్నాడు రాజా.

"అలాటి సభలకు తప్పకుండా వెళ్తాను. వెళ్లకపోతే నాన్నగారికి కోపం వస్తుంది కూడా" అన్నది సీత.

రాజా హృదయం పొంగిపోయింది. ఇద్దరి మధ్యా విశ్రబ్ధం ఆవరించింది.

"సీతా" మెల్లగా పిలిచాడు రాజా. సీత

మీకిష్టమైన నూనెలో నానబెట్టుడు
కాష్మీర్-కుసుం
కేశములను పెరిగించును. అకాలనెరనుపోగొట్టును.
చరుము ఉపద్రవములకు
సౌంటలక్స్
ములాము
చరుము అపాయములకు
నంజనగూడు పండ్లపొడి & అపూర్వ ఔషధములు ..
నంజనగూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**

ముడుచుకుపోయింది. రాజు ఎటో చూస్తున్నాడు. ఆమె తలవంచుకొని "ఊఁ" అంది. మెల్లగా.

"నేను చాలా అదృష్టవంతుణ్ణి. అయినా ఆ సంగతి ఈ ఇంటికి వచ్చేవరకూ నాకు తెలియదు" అన్నాడు రాజు. సీతకు ఏం చెప్పాలో తెలియలేదు. అతడి కేమేవో మాట్లాడాలని ఉంది. హృదయమంతా గొంతువరకూ ప్రవహించి ఆగిపోతూంది.

సీతకు ప్రసంగం మార్చాలనిపించింది. "పుస్తకం చదివారా" అన్నది.

రాజు మామూలు స్థితికి వచ్చాడు. "మంచి పుస్తకం ఇచ్చారు. అది నన్ను వశం చేసుకున్నది" అన్నాడు రాజు.

"మీకు అందులో అభిప్రాయాలు నచ్చాయా? అని అడిగింది సీత.

రాజు ఆమె ప్రశ్న లోతు గ్రహించి, "భావాలను మెచ్చుకోవడానికేముంది! ఎంతవరకూ ఆచరణ సాధ్యం అన్నదే ఆలోచిస్తున్నాను" అన్నాడు. అతడి కళ్లు విశాలమై తీక్షణంగా భవిష్యత్తులోకి చూస్తున్నాయి. విశాలమైన ఫాలభాగం మీదకు ముంగురులలోనుంచి ముత్యాల వంటి స్వేద బిందువులు జారుతున్నాయి. నల్లని కనుబొమలు శత్రు భయంకరంగా విల్లెక్కుపెట్టినట్టు ముడిపడ్డాయి. ఆలోచనాయత్తంగా ఉన్న అతడి గంభీరమైన ముఖాన్ని చూస్తూంది సీత. అతడొక మహాసామ్రాజ్యాన్ని ఏలుతున్న సామ్రాట్టులా, రాజనీతి కోవిదుడులా కనిపించాడు. "ఇక మీతో ఆవేదన తొలగిపోతుందనుకుంటాను" అన్నది సీత సాభిప్రాయంగా చూస్తూ. రాజు "ఆ ముహూర్తంకోసమే చూస్తున్నాను సీతా! ఇవాళ నీ మూలంగా నాకేదో వెలుగుబాట కనిపిస్తున్నది. నాక్కు దీని గురించి ఇంకా నిశ్చయ బుద్ధి ఏర్పడాలి" అన్నాడు. సీత బయలుదేరడానికి సిద్ధంగా ఉండమనీ, సభకు వేళ కావస్తున్నదనీ చెప్పి తను వెళ్లిపోయింది లోపలికి.

సభా మందిరంలో దేశభక్తుడు ఉత్తేజంగా ఉపన్యసించాడు. శ్రోతలందరిలోనూ స్వాతంత్ర్య భావన పెల్లుబికింది. శాంతి భద్రతల మిషతో పోలీసులు చుట్టూ నిల్చున్నారు. దేశభక్తుడు ముఖ్యంగా యువకులను హెచ్చరించి ముందుకు రమ్మని ఉద్బోధించాడు. రామరాజు కదలకుండా కూర్చొన్న శ్రోతలందరి మధ్యా పతాకంలా నిలిచాడు. ఉపన్యాసకుడు హిందీలో మాట్లాడుతూ, "ఇలారా నాయనా" అని ఆహ్వానించాడు. రాజు వేదిక దగ్గర కొచ్చాడు. "నీ పేరు?" అని ప్రశ్నించా డాయన. "అల్లూరి రామరాజు" అని సమాధానం వచ్చింది. ఉపన్యాసకునితో నాలుగు మాటలు చెప్పడానికి తనకు అనుమతి కావాలని చెప్పాడు రాజు. "అవశ్యం" అన్నాడు ఉపన్యాసకుడు. రాజు వేదికమీద నిలబడ్డాడు. వేదిక కొక పక్కగా సీత కూర్చుంది. రామరాజు శ్రోతల వైపు తిరిగి నమస్కారంచేసి ఆరంభించాడు.

"నేను ఇక్కడ అందరికంటె చిన్నవాణ్ణి. పెద్దలంతా స్వాతంత్ర్య భావన కలగాలంటున్నారు. నలభైకోట్ల మందిలోనూ ఈ భావన కలగాలంటే వేలాది ప్రచారకులూ, నిర్విరామ కృషీ అవసరం. దీనికి ఎంతోకాలం పడుతుంది. చిన్న సమావేశాలనే భరించలేక పోలీసులను పంపిస్తున్న నేటి ప్రభుత్వం, ముందునుంచీ ఈ ప్రచారాన్ని సాగనివ్వకుండా అవరోధాలు కల్పిస్తుంది. దీనికి వేరే సాధనం కావాలి. ప్రజల్లో ప్రభుత్వంపట్ల వ్యతిరేకత కలిగి విప్లవం లేవాలి. ఏ ఒక్క ప్రాంతంలో విప్లవాగ్ని ప్రజ్వరిల్లినా అది భారతదేశమంతటా పాకి దాస్యబంధాలను దహించివేస్తుంది. ఇదే స్వాతంత్ర్య సముపార్జనకు సాధనం. దీనిని గురించి పెద్దలంతా ఆలోచించి నిర్ణయించమని కోరుతున్నాను" అని ముగించాడు. మహారాష్ట్రుడు పక్కనున్న పెద్దమనిషిద్వారా రాజు మాటలను అర్థంచేసుకున్నాడు. కొంత ఆశ్చర్యపడినా ఎక్కువగా ఆనందించాడు. రాజు ముఖభంగిమలూ, కదలికలూ, ఘంటారావం వంటికంఠస్వరమూ ఎంతో ఉత్సాహం కలిగించాయి. రాజును కౌగలించుకొని, "దేశానికి నేడు నీవంటి వాళ్లే కావాలి. నీకు దేశమాత ఆశీర్వచనం లభిస్తుంది" అన్నాడు. రాజు కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించాడు. ఇదంతా చూస్తున్న సీత కళ్లు చెమర్చాయి. ఆమె ఆనందం అవధులు దాటిపోయింది. ఆమె తండ్రి వచ్చి రాజును అభినందించాడు. ముగ్గురూ గుర్రపుబగ్గీలో ఇంటికి బయలుదేరారు.

ఇంటికి చేరేసరికి రాజుకు మిత్రుడు కనిపించాడు. ఆ రాత్రి భోజనాలయాక డాబామీద కూర్చున్నారు. "రాజూ! ఇందాక సభలో మెరుపులా అందర్నీ ఆకర్షించావుట" అన్నాడు మిత్రుడు. "ఆకర్షించడం మాట నాకు తెలియదు. నీకెవళ్లు చెప్పారో గాని వాళ్లకు అలా అనిపించి ఉంటుంది" అన్నాడు రాజు. "అయిఉంటుంది" అన్నాడు మిత్రుడు. ఎవరు చెప్పారని రాజు అడగలేకపోయాడు. సీతే ఇలా అనిఉంటుందని ఆశించాడు.

వరుసగా రెండు మూడు రోజులు స్వాతంత్ర్యోద్యమం మీద తండ్రీ, కొడుకూ, రామరాజూ చర్చలు జరిపేవారు. అప్పుడప్పుడు సీతకూడా వస్తూండేది. తండ్రిగారి పరోక్షంలో అన్నయ్యా, రాజూ కూచుంటే తనుకూడా చర్చలో పాల్గొనేది. ఆమె చర్చలో పాల్గొంటే రాజుకు ఎంతో బలం వచ్చినట్టుండేది. చర్చ ఉత్సాహంగానూ, తనకు అనుకూలంగానూ ఉండేది. ఆమె మాటలను వింటూంటే అమితానందం కలిగి మూగవోయి తదేకదృష్టితో ఆమె ముఖ కవళికల్నీ, పెదవుల కదలికల్నీ చూస్తూ ఉండిపోయేవా డొక్కొక్కసారి. "నీ వాదానికి సీత తోడ్పాటు ఉండడంవల్ల అదృష్టవంతుడివైపోయావు రాజూ. లేకపోతే నువ్వు ఒక్కడివీ కష్టపడిపోతావు"

(తరువాయి 49 వ పేజీలో)



మాదాకవళం, అమ్మా!

చిత్రం—బి. శశి (పేరుసెట్టిపాలెం)

# సీతారాముల ప్రణయం

( 17వ పేజీ తరువాయి)

అన్నాడు మిత్రుడు నవ్వుతూ. రాజు తిరిగి "మా ఇద్దరితో నువ్వు మాత్రం ఎందుకు ఏకీభవించకూడదూ" అన్నాడు. "నాకు విప్లవ స్వభావం లేదు. అందుకు నా సానుభూతి ఉంటుంది" అని తప్పుకున్నాడు మిత్రుడు.

రోజులు గడిచినకొద్దీ సీతపైన ఒక అనుబంధం రాజాకు కలిగింది. సీత లేకపోతే తన ఆశయాలకు బలం లభించదనిపించింది. 'సీత తనతో ఉంటే ఎంతటి అజేయమైన కార్యాన్ని అయినా సాధించవచ్చుననిపించింది. తనకు సీతసహచారిణిగా లభించే అదృష్టమున్నదా! ఆమెకు తన మనస్సు తెలుసా! ఈ శాశ్వతమైన ఏకీభావానికి అంగీకరిస్తుందా! కాదంటే తన జీవనస్రవంతి ఇంకిపోదా! సీతను ప్రార్థించి అయినా ఒప్పించాలి! ఒంటరిగాసీతతో ప్రస్తావించా'లనుకున్నాడు రామరాజా. అన్నయ్య లేకపోయినా ఈ మధ్యగదివరకూ వచ్చి మాట్లాడి వెళ్ళుతూంది సీత. ఇవాళ కూడా అలాగే వచ్చింది. "సీతా! నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి" అన్నాడు రాజా.

"చెప్పండి" అన్నది సీత కొత్తగా రాజా ముఖం చూస్తూ.

రాజా అటు తిరిగి గొంతు సర్దుకొని "కోపగించుకోకుండా నీ మనస్సులో ఉన్నదున్నట్లు చెప్తావా" అన్నాడు మెల్లగా.

సీత అవతల ఎవరూ రాలేదుకదా అని ఒకసారి చూసి "ఊ" అన్నది గుండెకు ధైర్యంచెబుతూ.

"నా జీవితానికి ఇక్కడికి వచ్చాకనే లక్ష్యసిద్ధి ఏర్పడింది. అందుకు కారణం నువ్వు! నిన్ను ప్రశంసించడం లేదు. నువ్వు లేకపోతే నా కీ అభిప్రాయాలు బలపడవు. కాని ఇవి ఆచరణలోకి రావాలన్నా నీ తోడ్పాటు నాకు...నాకు కావాలి సీతా! మనం మన ఉద్యమపథంలో సహచరులం కావాలి" అన్నాడు రాజా.

సీత తొట్రుపడింది. ఆమె నోటివెంట మాట రావడం లేదు. ఒక మూల భయం, మరో వైపు లజ్జ కలుగుతున్నాయి.

"అర్థమయింది కదూ సీతా! మనం ఏకమవాలని నా కోరిక. నువ్వు కాదంటే నా జీవితాని కింక వెలుగేలేదు. కాదు కాదు. ఈ జీవితమే ఉండదు" అన్నాడు సీతవైపు తిరిగి ఉద్వేగంతో.

సీత కళ్ళు నీరు చిమ్మాయి. ఆమె గొంతు వణకిపోయింది. "అలా అనకండి...మీరు...మీరు ఆరాధ్యదైవం. మీరలాగంటే సహించలేను" అన్నది సీత ముఖం వాల్చి.

రాజా పొంగిపోయాడు. "చాలు సీతా! నేను పొరపాటు పడలేదు. నా సీత హృదయం నాకు తెలును" అన్నాడు.

• • •

అన్నయ్యకూడా లేకపోతే సీత రావడంలేదు. రాజా ఆమెకోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. ఆమె గదిగుమ్మంలో పెట్టిన కాలు వెనక్కు లాక్కొని వెళ్ళబోయింది.

"సీతా! వెళ్ళిపోతున్నావేం" అన్నాడు రాజా.

"అన్నయ్య ఉన్నాడేమోనని..." అన్నది.

"నే నున్నానుగా?" అన్నాడు రాజా.

"ఊహూ! అన్నయ్యతో పనిఉంది" అన్నది నాలిక నొక్కుకొని.

"నా దగ్గర అబద్ధాలాడుతున్నావా? ఇలా వచ్చి కూచోకూడదా?"

"ఊహూ!" అన్నది సీత.

"ఏం?" మళ్ళీ రాజా ప్రశ్న.

సీత ముఖం ఎత్తకుండానే "ఒక్కరైనా మీ ఎదుట కూచోలేను" అన్నది.

"పోనీలే సీతా. నీ అన్నయ్యతోనైనా రా! అలాగైనా చూడడం అవుతుంది" అన్నాడు రాజా.

సీత చిరునవ్వు దాచుకొని వెళ్ళిపోయింది. రాజుకు మిత్రుడు పక్కఊరు వెళ్ళాడని తర్వాత తెలిసింది. రాత్రికి వస్తాడన్నారు. కాని రాత్రి ఎంతకూ రాలేదు. భోజనం దగ్గర సీతే శ్రద్ధ తీసుకొని చూసింది.

రాత్రి తన మిత్రుడి గదిముందు డాబామీద కూర్చున్నాడు రాజా. వెన్నెల ఈ ప్రపంచమంతటా శాంతిపరిచినట్లుంది. సన్నగా గాలి వీస్తూంది. రాజుకు సన్నని పాట కూడా వినిపిస్తూంది. ఎదురుగా గదిలో సీత పాడుతూందనుకున్నాడు రాజా. కృష్ణుని రాసక్రీడలపైని జయదేవుని అష్టపది. 'గీతగోవిందంలో ఎంతటి సరళమైన పద సంపుటి, ఎంత సున్నితమైన భావ సంపుటి కూర్చాడా మహాకవి!' రామరాజా పాటలో లీనమైపోయాడు. 'రాధ కృష్ణుడి కోసం వ్యధ చెందుతున్నది. సీత ఎంత చక్కగా ఆ విరహగీతికలోని భావాన్ని తన మధురగళంలో నుంచి వెలువరించింది! ఆ అనుభూతిలో సీత పరవశం చెందుతూంది. ఆ విరహానుభూతిలో అంత మాధుర్యం అనుభవిస్తున్నదా సీత! సీతను ఇప్పుడు చూస్తే? కృష్ణుడు రాగానే మూగవోయి, కృష్ణుడిఒళ్ళో వాలిపోయిన గోపకన్యలా అయిపోతుందా! ఆనంద పారవశ్యంలో కళ్ళు మూతలు పడ్డ సీతను ఒక్కసారి చూడాలి!' రాజా ఆనందపు మత్తులో సీత గదివైపు నడిచాడు. సీత గదిలో దీపం అప్పటికే తగ్గించి ఉంది. ఆమె పాట ఆపి ఎంతసేపయిందో రాజా తన ఆలోచనల్లో గుర్తించలేదు. తలుపుతోసి లోపలకు అడుగుపెట్టాడు. సీత తలుపు చప్పుడు విని హఠాత్తుగా లేచి "ఎవరు?" అన్నది. ఆమె గొంతులో భయం ధ్వనించింది.


స్థాపితం 1920

రెడ్డి అండ్ కో. (రిజిష్టర్డు)

గోపాలపురం తూ. గో. జిల్లా

కుష్ఠు బొల్లి మేహపాడ వగైరా చర్మసుఖ వ్యాధులకు శాస్త్రీయ- ప్రత్యేక చికిత్స.

ఆయుర్వేద ఔషధములు లభించును

→ కేటలాగు సలహా ఉచితము

బ్రాంచిలు: వాల్తేరు ఆర్. ఎస్. సికింద్రాబాద్ —3560 కింగ్స్వే

## డాక్టర్ వృత్తి చేయుండి!

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు పోసల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

**INDIAN HOMOEOPATHIC COLLEGE (A.W.P.) JULLUNDUR CITY**




మిమ్ము దొంగల నుండి అడవి జంతువులనుండి కాపాడుకొనండి. యాత్రీకులకు, విందులకు డ్రామాలకు పనికి వచ్చును. లైట్‌షాట్ ఆటోమాటిక్ రివాల్వరు. కండ్లు చెదరగొట్టే మంటలు మిమ్ము అపాయంనుంచి కాపాడును. ధరలు: నం. 778, రు. 6—50, 889 రు.8—50, 1001 రు13—50లు. 25 తోటాలు ఉచితం. అదనంగా 100 తోటాలు రు. 5/— తోలు సంచి రు. 6/— లైసెన్సు అక్కరలేదు. పోస్టేజి రు. 2/— అదనం.

**INDIAN CHAMBER OF SCIENCE (W.A.P.) Jullundur City.**

# సీతారాముల ప్రణయం

"నేను" అన్నాడు రామరాజు.

ఆమె దీపం వెలిగించింది. "మీరా?" అన్నది ఆశ్చర్యంగా.

"నేనే సీతా! అంత భయపడతావెందుకు?" అన్నాడు రాజు.

"భయంకాదు...ఇలాటి సమయంలో ఎందు కొచ్చారు" అన్నది సీత.

"ఇది మంచి సమయం కనుకనే, సీతా, వచ్చాను. ఒక్కసారి అవతలికి చూడు. వెన్నెల ఎలా పరుచుకుందో! ఇందాకటి నీ పాట విన్నాను. అద్భుతంగా పాడావు సీతా! నన్ను మత్తెక్కించింది. నీ దగ్గరకు రాకుండా ఉండలేకపోయాను" అన్నాడు రాజు.

ఆ క్రీనీడలో సీత ముఖ భంగిమలు కని పించకపోయినా ఆమె కన్నీరు పెట్టుకొని వెక్కుతున్నట్లు అర్థమవుతూంది. గొంతులో పెద్ద బరువు పడ్డట్టుగా "మీరు పొరబాటు చేశారు.. వెంటనే వెళ్లిపొండి" అన్నది సీత నొక్కి పలుకుతూ.

"కోపం వచ్చిందా సీతా" అన్నాడు రాజు.

ఆమె కంఠం ఇంకా గద్గదస్వరంతో పూడ్చుకుపోతూఉండగా ఉద్వేగాన్ని ఆపుకోలేక "మీ గురించి ఎంతో గొప్పగా ఊహించుకొన్నాను. గౌరవించి ఆరాధించాను. ఇంత దౌర్బల్యం ఉన్న మీమీద... కాదు. నాదే పొరపాటు. మీరింత చపల చిత్తులనుకోలేదు. నన్ను క్షమించి ముందిక్కడ నుంచి వెళ్లిపొండి" అన్నది. ఆమె గుండె తీవ్రంగా కొట్టుకున్నది. పెదవులు ఇంకా కదులుతున్నాయి. తల దిండులో కప్పుకొని కన్నీళ్లతో తడిపివేసింది. రాజు వెళ్లిపోవడం ఆమె చూడలేదు.

• • •

ఉదయం సీత దాసీ వచ్చి లేపేవరకూ లేవ లేదు. మేడ దిగుతూంటే అన్నయ్య ఎదురు పడి "ఏం సీతా అలా ఉన్నావు" అని అడిగాడు. సీతకు ఏదో గుర్తు వచ్చినట్లు "ఏం! ఏంలే దన్నయ్యా" అంటూ వెళ్లిపోయింది. ఆమె కళ్ళు ఉబ్బి ఉన్నాయి. ఎర్రగా చింతనిప్పుల్లా అయి పోయాయి. రాత్రల్లా నిద్రలేదని ఏడ్చి ఏడ్చి పడుకున్నదనీ ఆమె ముఖం చెప్పక చెబుతూంది. సీతకు మనస్తాపం కలిగే విషయం ఆ ఇంట్లో ఎప్పుడూ సంభవించలేదు. ఆమె సోదరుడి కిదంతా తెలుసు. తను తిన్నగా తన గదికి వెళ్లి పరిశీలించి వచ్చాడు. వీధి గుమ్మంలో కూచున్న నౌకర్ని "రాజు కనిపించాడా" అని అడిగాడు. వాడు "తెల్లవారుఝామున గేటు తియ్యమని బయటకు వెళ్లిపోయారు బాబూ" అన్నాడు. "ఏమైనా చెప్పాడా" అన్నాడు. "ఏమీ అనకుండా వెళ్లిపోయారు బాబూ" అన్నాడు నౌకరు. తన గదిలోనికి వెళ్లి మళ్లీ టేబులు తెరిచి వెతి కాడు. పరుపులూ దిళ్లూ వెదుకుతూండగా ఒక దిండుకింద చీటీ ఒకటి దొరికింది. 'ప్రియ మిత్రునికి—నువ్వు ఇన్నాళ్లు చూపించిన ప్రేమా దరాలకు కృతజ్ఞుణ్ణి. నేను వెళ్తున్నాను. మళ్లీ కలుస్తామో లేదో చెప్పలేను. నీతో ముందుగా చెప్పకుండా వెళ్తున్నందుకు క్షమించు—రాజు' అని చదువుకున్నాడు మిత్రుడు. ఈ ఉత్తరంవల్ల బోధపడినదేమీ లేదు. తొందరగా మేడ దిగి వెళ్దామనుకుంటూండగా ఎదురుగా సీత రావడం చూసి ఆగాడు. ఆమె పైకి రాగానే "నీతో మాట్లాడాలి. ఒక్కసారి ఇలా రా అమ్మా" అన్నాడు. సీత తలవంచుకొని అనుసరించింది.

"ఒక్క మాట అడుగుతాను. దాచకుండా చెప్పమ్మా" అన్నాడు.

సీత ముఖం విషాదం కమ్ముకొన్నది. "చెప్ప వలసినదైతే చెప్తా నన్నయా" అన్నది సీత.

"సీతా! నీ మనస్సుకు వ్యతిరేకంగా ఏది జరిగినా నాకు కష్టం కలుగుతుంది. నాకు నీకంటె ఎవరూ ఎక్కువ కాదు. ఒక్కమాట చెప్పు. నువ్వూ రాజూ ఏమైనా మాటా మాటా అనుకున్నారా" అన్నాడతను. సీత వెనుదిరిగే డగ్గుత్తికతో "లేదన్నయ్యా" అన్నది.

"మరి ఇదేమిటి సీతా" అన్నాడామె ముందు చీటీ అందిస్తూ.


చాలానమ్మకమైనవి



"సులేఖ"
మరియు
"బ్రీఫ్‌మన్"
ఫౌంటెన్‌పెన్‌లు
PENMEN'S INDUSTRIAL SERVICES
BOMBAY - 67.

మూత్రాశయపు మంట
స్త్రీ పురుషులకు హానికరము

35 సం. పై బడిన స్త్రీ పురుషులు మూత్రాశయపు వ్యాధులతో నిర్వీర్యులై దౌర్బల్యముతోనుందురు. వెన్నుపోటు, కీళ్ళనొప్పులు, బాధతోకూడిన మూత్రవిసర్జన, రాత్రి లేక పగలు తరచుగా మూత్రము విడచుట, కాళ్ళ నొప్పులు, నిద్రలేకుండుట, బలహీనత మొదలగు లక్షణములకు మూత్రాశయపు వ్యాధులే కారణముకావచ్చును. చలి జ్వరము గూడా తరచుగా ఆపాదించవచ్చును. 30 సం నుంచి యీ మూత్రాశయపు వ్యాధులకు వేలకొలది రోగులు సిస్టెక్స్ (CYSTEX)ను వాడుచున్నారు. నేడే సిస్టెక్స్ (CYSTEX)ను మీ కెమిస్టు వద్ద కొనండి ఇది శీఘ్రముగా గుణమునిచ్చును. తప్పక తృప్తినివ్వగలదు. పూర్తిగా స్వస్థత చేకూరనిచో సొమ్ముని వాపసుచేయబడును.

రాంతీర్థ బ్రాహ్మీ నూనె
(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు



చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెంపొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.

రాంతీర్థ హెయిరాయిల్ పెద్ద సీసా: రు. 4/50, చిన్నసీసా: 2/25.

యోగాసన చార్టు సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.

పోస్టేజితో ధర రు. 3/—లు మాత్రమే.

శ్రీ రాంతీర్థ యోగాశ్రం
దాదర్, బొంబాయి - 14.

చీటీని చదువుకొని ఆమె హఠాత్తుగా పక్క మీద తలదాచుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

ఆమె అన్నయ్య "సీతా! ఏమిటమ్మా ఈ వెర్రి" అన్నాడు తల నిమురుతూ.

"అన్నయ్యా" అంటూ అతడి ఒళ్లో తలవాల్చి ఏడ్చింది. "నేనేమీ తప్పుచేయలేదన్నయ్యా! శిక్ష మాత్రం అనుభవిస్తున్నాను." ఆమె కన్నీటి ధారను ఆపడం అతనికి చేతకానిది. ఆ స్థితిలో జరిగిన దేమిటో కూడా అడిగి తెలుసుకోవడం సాధ్యపడదనుకున్నాడు.

• • •

సీత తన గది వదలి రావడం లేదు. పగలంతా అలాగే కూర్చుంటుంది. శూన్యంలోకి చూస్తూం టుంది. వేళకు తిండీ తిప్పలూ పై వారి బల వంతం వల్ల అయినంత అవుతున్నాయి. తిండి తినడం లేదని ఆ మాతృమూర్తి క్షోభ పడింది. అయినా దీనికి కారణం ఏమిటో ఆమెకు తెలి యదు. సీత ఎవరితోనూ మాట్లాడడమే లేదు. సీత నేదో ప్రశ్నించాలనుకున్నాడు సోదరుడు. ఆమె విషణ్ణ వదనం చూచి, ఆ విషాద సముద్రాన్ని కల్లోల పరచడానికి భయపడ్డాడు. ఆమె హృద యంలో అణగిన శోకాగ్ని పర్వతాలు ఏ సమ యంలో పేలిపోతాయో అని భయపడ్డాడు. రోజులూ మాసాలూ గడిచిపోతున్నకొద్దీ సీత పరధ్యానం, బేలచూపు ఎక్కువైపోయాయి. కళ్లు లోతుకుపోయి మనిషి పుల్ల అయిపోయింది. ఎముకలు కనిపిస్తున్నాయి. తండ్రీ సోదరుడూ ఆమె ఈ వివరీత పరిస్థితికి ఆందోళన పడ్డారు. ఆమెకు అన్నయ్య చెప్పే ఊరడింపు మాటలు శోకానికే కారణమవుతున్నాయి. సీత మనస్సు తెలిసిన సోదరుడు, ఎక్కడెక్కడికి రాజు వెళ్లడానికి వీలున్నదో అక్కడికల్లా జాబులు వ్రాశాడు— సీతకు జబ్బుగా ఉందనీ, ఒక్కసారి రమ్మనీని. ఎక్కడనుండీ జాబు లేదు. నాన్నగారికి చెప్ప కుండానే రాజు స్వగ్రామం మోగల్లు వెళ్లాడు. అక్కడివారికి కూడా రాజు జాడ తెలియదు. అక్కడ రాజు పినతండ్రితో, "రాజువస్తే వెంటనే తెలియజేయండి. అత్యవసరంగా అతను కావాలి" అని చెప్పి తిరిగి విశాఖపట్నం చేరుకున్నాడు. సీత దగ్గరకు రాగానే ఆమె లేవబోయింది. "నువ్వు కదలవద్దు, తల్లీ. అలాగే పడుకో" అన్నాడు. ఆ మాట చెబుతూంటే అతని కళ్లు చెమ్మగిల్లాయి.

"ఎందుకన్నయ్యా కంట తడి" అన్నది సీత.

"అమ్మా!" ఆమె మంచం ముందు కూర్చుని తల దండెకు ఆన్చి కన్నీరు పెట్టుకొని, "నీకు నేనేమీ చేయలేక పోతున్నాను తల్లీ" అన్నాడు. ఆమె ప్రసంగం మార్చాలని, "ఇవాళ ఎక్కడికి వెళ్లావన్నయ్యా" అని అడిగింది. "ఎక్కడికీ లేదు సీతా" అన్నాడు తల దించుకొని.

సీతకు అతనేదో ఊరు వెళ్లాడని తెలుసు. కాని చెప్పలేదు. చెప్పకపోవడంచేత ఎక్కడికి వెళ్లొ చ్చాడో ఆమె ఊహించింది. అతనికి తన్ను సుఖపెట్టాలనీ, బ్రతికించాలనీ ఎంత పట్టుదలగా ఉన్నదో తెలుసుకొన్న సీతకు కను కొనలనుంచి నీరు బిందువులుగా పాలిపోయిన బుగ్గలమీదకు జారింది.

"ఎందుకమ్మా, మనస్సు పాడుచేసుకుంటావు? రామ రామ నీ ఆరోగ్యం దిగజారుతూ ఉంది. ఇలాగైనా నిన్ను చూచుకొని బ్రతకనియ్యమ్మా. సీతా! నీ మనస్సు, శరీరం ఇంకా పాడుచేసుకొని మమ్మల్ని అన్యాయం చేయకు తల్లీ" అంటూ కన్నీరు పెట్టుకున్నాడు.

"అన్నయ్యా, మిమ్మల్ని బాధపెడుతున్నాను. అంతే నన్నయ్యా నా విచారం. నువ్వు నాకోసం ఎంత బాధపడుతున్నావో తెలుసు. నాకు తెలియ కుండా నా సుఖసంతోషాలకోసం ఇంకా ఆశతో ఎక్కడెక్కడికో వెళ్లివస్తున్నావని తెలుసన్నయ్యా" అన్నది సీత. నాన్నగారు రావడంతో ఇద్దరూ ఆగి పోయారు.

• • •

తిరిగి తిరిగి రామరాజు నాసిక చేరి అక్కడ కొంతకాలం గడిపాడు. దారిలో తన పూర్వ స్నేహి తులను కలుసుకుంటూ ఎంతోకాలానికి మళ్లీ తన స్వగ్రామం మోగల్లు చేరాడు. అతడి ఆత్మీయు లంతా ఎంతో ఆప్యాయంగా ఆనంద బాష్పాలు రాల్చారు. ఆ రోజు భోజనాలయాక పినతండ్రి రామరాజుతో 'విశాఖపట్నంనుంచి మిత్రుడు వచ్చి ఫలానా చెప్పి వెళ్లా'డని చెప్పాడు. వెంటనే రాజు విశాఖపట్నం జాబు వ్రాశాడు, తనుమోగల్లు చేరినట్టు. నాలుగు రోజుల్లో జవాబు కూడా వచ్చింది రాజుకు. ఆ జాబు చదవగానే రాజుముఖం పాలిపోయింది. సీతకు అంత ప్రాణాపాయ స్థితి ఎలా వచ్చిందనుకున్నాడు. వెంటనే విశాఖపట్నం బయల్దేరాడు.


విశాఖపట్నం చేరుకునే సరికి సాయంత్రం అయింది. మేడ ముందు గుర్రపు బగ్గీ ఉంది. సంజె చీకట్లు అలుముకుంటున్నాయి. నౌకరు హడావుడిగా బయటకు వస్తూండగా "పైని బాబుగారున్నారా" అని అడిగాడు రాజు.

"పైకి వెళ్లండి బాబూ. అంతా అక్కడే ఉన్నారు" అన్నాడు గాభరాగా.

రాజుకు కాళ్లు వణికిపోతున్నాయి. గుండె కలచివేసినట్టయింది. అడుగులు బరువుగా వేస్తూ తొట్రుపడుతూ మెట్లెక్కుతున్నాడు. ఎదురుగా గదిలో కొందరు వ్యక్తులున్నారు. సీత మంచానికి ఓ పక్కగా డాక్టరూ, మరోపక్క తల్లీ, తండ్రీ, అన్నయ్యా నిల్చొని ఉన్నారు.

రాజు గబగబా లోపలికి వెళ్లాడు. "రాజా! వచ్చావా! చూడు, నాయనా, చూడు మా సీత ఎలాగయిపోయిందో! మా సీత మమ్మల్ని అన్యా యం..."ముసలాయనవెచ్చిగామాట్లాడుతూంటే "ఊరుకోండి నాన్నగారూ" అన్నాడు కొడుకు.

"రాజా నువ్విలారా" అని మంచం పక్కకు తీసుకువెళ్లాడు. రామరాజు గుండె కదలిపోయింది. ఇదెవరు! తన సీత! ఇలా రూపురేఖలు మారి ఎముకల పోగయిపోయిందా! బంగారు బొమ్మ లాంటి సీత ఎండిపోయిన గడ్డిబొమ్మలా పడి ఉందేమిటి! రాజు గుండె చెరువై కన్నీరు ధార లైంది. నోటికి చేతులు అడ్డపెట్టుకొని దిగమింగ ప్రయత్నిస్తున్నాడు. సీత వెర్రిగా అటు చూస్తున్న కళ్లు ఇటు తిప్పడానికి ప్రయ త్నిస్తూంది. రాజు చూడలేకపోయాడు. ఆమె కళ్లు గుంటలుపడి ఎండిపోయాయి.



ఫతేపూర్ సిక్రీ ముఖద్వారం
(ఆగ్రా)
ఫోటో—వై. మధుర మోహనబాబు
(బంటూరా)

"అమ్మా, సీతా, రాజు వచ్చాడు చూడమ్మా. మన రామరాజు" అన్నా డామె అన్నయ్య.

ఎండిన ఆమె కళ్లల్లో ఆర్ద్రత కనిపించింది. కళ్లు నిటు తిప్పింది. వెలుగు వచ్చినట్టయింది.

"సీతా, నేను రాజును సీతా!" అతని గొంతు వణికిపోయింది.

గుంటలు పడిన ఆమె కళ్లలోనుంచి ఒక కన్నీటి బొట్టు ఎండిపోయిన బుగ్గలమీదకు జారింది. ఆమె నోరు కదిల్చి చిరునవ్వు నవ్వ డానికి ప్రయత్నించింది. కాని అంతటితో ఆగి పోయింది.

"సీతా!" పెద్ద కేకవేసి మంచాన్ని తల కొట్టు కుని ఏడ్చాడు రాజు. ఇల్లంతా రోదన ధ్వనులతో నిండిపోయింది. అతని ప్రేమజ్యోతి ఆరి పోయింది. రామరాజు ఆ భయంకర దృశ్యాన్ని, ప్రేయసి నిర్జీవకళేబరాన్ని చూడలేక తూలుతూ వచ్చేస్తున్నాడు. మధ్య హాల్లో గోడను చిరునవ్వు లొలికిస్తూన్న సీత ఫోటో కనిపిస్తూంది. ఇక్కడే తన జీవితానికి లక్ష్యసిద్ధి కలిగించింది సీత. తనకు వెలుగు చూపి ఉత్తేజాన్ని కలిగించింది. ఆమె తనతో భౌతిక సౌఖ్యాలు కోరలేదు. ప్రజల దాస్య విముక్తికోసం జీవితాన్ని అర్పించమని కోరింది. ఆమె కోరిక తీర్చినప్పుడే ఆమె ఆత్మకు శాంతి! ఆమె తనపై పెట్టుకున్న ఆశలు తీర్చినప్పుడే తన ప్రేయసి ఆత్మకు శాంతి! ! రామరాజు తల నిండా ఆలోచనలే.

ప్రేయసి పేరు 'సీత' రామరాజుతో కలిసి పోయింది. స్వాతంత్ర్యోద్యమ దీక్షాకంకణుడూ, భౌతిక సౌఖ్యాలకు దూరమైన విరాగీ, మన్య ప్రజలకు అండగా నిల్చి, పర ప్రభుత్వానికి పక్కలో బల్లెమై ఎదిరించిన వీరుడూ, అల్లూరి 'సీతా'రామరాజు ఆరోజే అవతరించాడు. ★